# 29. జకాత్ విశిష్ఠత

**ముస్లిం సోదరులారా..!**

ఈ రోజు ఖుత్బా (ప్రసంగం)లో జకాత్ ఆదేశాలు, విశిష్ఠత గురించి తెలుసుకుందాం. ఇస్లామీయ ప్రాథమిక విధుల్లో ఎంతో విశిష్ఠత ప్రాముఖ్యత గల నాల్గవ మూలాంశం జకాత్. ఖుర్ఆన్ గ్రంథంలో ఎక్కడైతే నమాజ్ స్థాపించమని అల్లాహ్ ఆజ్ఞాపించాడో అక్కడే జకాత్ (విధి దానం) చెల్లించమని కూడా నొక్కి చెప్పాడు. ఇలాంటి ఆయతులు ఖుర్ఆన్ కరీంలో 82 కు పైగా ఉన్నాయి. అందుకే జకాత్ విధిని ధిక్కరించేవాడు కాఫిర్ (సత్య తిరస్కారి) జకాత్ చెల్లించని వానికి కఠిన శిక్ష ఉంది.

**అబూ హురైర (రజి) కథనం ప్రకారం, అల్లాహ్ ఎవరికయితే ధన సంపదలను ఇచ్చాడో అతడు ఆ ధనంపై జకాత్ చెల్లించనట్లయితే ఆ ధనం పరలోక దినాన తీవ్ర విషపూరిత భయంకర ఆకారం గల ఒక పెద్ద సర్పంగా చేయబడుతుంది. ఆ సర్పాన్ని అతని మెడలో సంకెళ్ళుగా చేసి వేయబడుతుంది. అది అతని మోహాన్ని హృదయాన్ని కాటేస్తూ నేను నీ ధనాన్ని నేను నీ నిధిని ఇక ఇప్పుడు రుచి చూడు" అని అంటుంది. తరువాత దైవ ప్రవక్త(స) ఈ ఆయత్‌ను పఠించారు.**

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا إِنَّ كَثِيرًا مِّنَ الْأَحْبَارِ وَالرُّهْبَانِ لَيَأْكُلُونَ أَمْوَالَ النَّاسِ بِالْبَاطِلِ وَيَصُدُّونَ عَن سَبِيلِ اللَّهِ ۗ وَالَّذِينَ يَكْنِزُونَ الذَّهَبَ وَالْفِضَّةَ وَلَا يُنفِقُونَهَا فِي سَبِيلِ اللَّهِ فَبَشِّرْهُم بِعَذَابٍ أَلِيمٍ (34)

**విశ్వసించిన ఓ ప్రజలారా! (యూదులు, క్రైస్తవులలోని) ఎందరో పండితులు, సన్యాసులు అధర్మంగా ప్రజల సొమ్మును స్వాహా చేస్తున్నారు. ప్రజలను అల్లాహ్ మార్గం నుండి ఆపుతున్నారు. ఎవరయితే వెండీ బంగారాల ఖజానాను ప్రోగుచేసి ఉంచి, దైవమార్గంలో**

teluguislam.net



**ఖర్చుచేయరో, వారికి వ్యధాభరితమయిన యాతన ఉంటుందన్న సమాచారం వినిపించు.** ***(అత్ తౌబా 9 : 34)***

అందుకోసమే ముస్లింలు ధన వ్యామోహంలోపడి పరలోకాన్ని విస్మరించ కూడదు. పరలోక పరాభావం, అవమానం నుండి రక్షణ పొందటానికి ఇహలోకంలోనే శతవిధాలా ప్రయత్నించాలి. డబ్బు ఖర్చు చేస్తే పేదరికం వాటిల్లుతుందని షైతాన్ మనసులో ప్రేరేపిస్తాడు. అలాంటి సమయంలో మదిని ఇలా సముదాయించాలి. నీవు ఇష్టపడే ఈ ధనం, డబ్బు ఎలాగైనా, ఎప్పుడైనా చేతిలోనించి చేజారిపోయేదే. నేనైనా దాన్ని వదిలిపెట్టి పోతాను లేదా అదే నన్ను వదిలిపెట్టి వెళ్ళిపోతుంది. నశించిపోయే, జారిపోయే ఈ డబ్బును ఎప్పటికీ అంతం కాని ఎల్లప్పుడు ఉపయోగపడే మంచి కార్యాలు దానధర్మాలకు ఎందుకు ఖర్చు చేయకూడదు?"

జకాత్ చెల్లించేవారికి, దానధర్మాలు చేసేవారికి అపూర్వమైన పుణ్యఫలం, ఉన్నత స్థానం ఉంది. అల్లాహ్ సూరెబఖరాలో ఇలా సెలవిచ్చాడు:

مَثَلُ الَّذِيْنَ يُنْفِقُوْنَ اَمْوَالَهُمْ فِيْ سَبِيْلِ اللّٰهِ كَمَثَلِ حَبَّةٍ اَنْۢبَتَتْ سَبْعَ سَنَابِلَ فِيْ
كُلِّ سُنْۢبُلَةٍ مِّائَةُ حَبَّةٍ ؕ وَاللّٰهُ يُضٰعِفُ لِمَنْ يَّشَآءُ ؕ وَاللّٰهُ وَاسِعٌ عَلِيْمٌ ﴿261﴾

**అల్లాహ్ మార్గంలో తమ ధనాన్ని ఖర్చుపెట్టేవారి ఉపమానం ఏడు వెన్నులను మొలకెత్తించే విత్తనం లాంటిది. ప్రతి వెన్నులో నూరు ధాన్యపు గింజలుంటాయి. అల్లాహ్ తాను కోరిన వారికి(ఇంత కన్నా) పెంచుతాడు. అల్లాహ్ మహా విశాలుడు. మహా జ్ఞాని.** ***(అల్ బఖర 2 : 261)***

హజ్రత్ అబూ హురైరా (రజి) కథనం దైవ ప్రవక్త (స) ఇలా ప్రవచించారు. ఖర్జూరం దానికి సమానమైన మంచి వస్తువును ఎవరయితే అల్లాహ్ మార్గంలో ఖర్చు చేస్తారో, ఆ ధనాన్ని అల్లాహ్ ఎంతో గౌరవంగా స్వీకరిస్తాడు. దాన్ని ఆ వ్యక్తి కోసం పోషిస్తాడు ఎలాగయితే వ్యక్తి దూడను పోషిస్తాడో. చివరికి ఆ ఖర్జూర పరిమాణం పెరుగుతూ పెరుగుతూ కొండంత అవుతుంది. (సహీహ్ బుఖారీ)

అంటే ప్రళయదినాన మంచి చెడులను తూచేటపుడు ఆ ఖర్జూర పరిమాణం (దానం) పర్వతం పరిమాణానికి సమానంగా త్రాసులో పెట్టబడుతుంది.

హజ్రత్ అనస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రబోధించారు నిశ్చయంగా దానధర్మాలు అల్లాహ్ ఆగ్రహాన్ని చల్లబరుస్తాయి. మృత్యుసమయ యాతనలను తగ్గిస్తాయి. (సునన్ తిర్మిజీ).

**మహాశయులారా..!**

కొంత మంది సంవత్సరకాలంలో మంచి కార్యాల్లో జకాత్ మూలధనం ఎంత వుందో అంతవరకే ఖర్చు చేస్తారు. అంటే జకాత్ మాత్రమే చెల్లిస్తారు. జకాత్ మాత్రమే విధి అని భావిస్తారు. మిగితా ఐచ్ఛిక దాన ధర్మాలు కూడా చేయాలని ఆలోచించరు. ఈ ఆలోచనా ధోరణి సరైనదికాదు. జకాతే కాకుండా మిగతా ధన సంపదల్లో వస్తువుల్లో కూడా నిరుపేదల, బీద జనుల హక్కు ఉంది. వారికి దానధర్మాలు చేయాలి.

తఫ్సీరుల్ జామీ లో లైసల్ బిర్ర అన్ తువల్లు వుజూహకుం ఆయత్ వ్యాఖ్యానంలో ఇబ్నె అబీ హాతిం ఇలా పేర్కొన్నారు: దైవప్రవక్త (స) ఈ ఆయతులో ఇలా అన్నారు: "ధనంలో జకాత్ కాక ఇతర విధులు కూడా ఉన్నాయి".

ఉదాహరణకు ఒకరి వద్ద ఆవులు, గేదెలు వంటి పాలిచ్చే జంతువులున్నాయి. వ్యవసాయానికి తోడ్పడే పశువులు, పరికరాలు, సాధనాలు వంటివి ఉన్నాయి. అలాంటప్పుడు అవసర రీత్యా వాటిని ఇతరులకు సహాయం కోసం, వారి ప్రయోజనం కోసం ఉపయోగిస్తూనే ఉండాలి. ప్రతి డబ్బున్న వ్యక్తిపై ఏ విధంగా జకాత్ విధిగా ఉందో అలాగే ఈ సాధనం, పరికరాలున్న వ్యక్తిపై ఈ పని విధిగా ఉంది. దీనిని నిర్వర్తించకపోతే పరలోక దినాన అల్లాహ్ సమక్షంలో పట్టు బడిపోతాం. మరొకొందరు జకాత్ చెల్లిస్తారు. కాని తాము ఉపకారం చేశామని దెప్పి పొడుస్తారు. దీని వలన కూడా పుణ్యం క్షీణిస్తూ పోతుంది. ఇదే విషయాన్ని అల్లాహ్ ఇలా తెలుపుతున్నాడు:

يَٰٓأَيُّهَا ٱلَّذِينَ ءَامَنُوا۟ لَا تُبْطِلُوا۟ صَدَقَٰتِكُم بِٱلْمَنِّ وَٱلْأَذَىٰ

**"దెప్పి పొడుపులతో, గ్రహీత మనస్సును నొప్పించే చేష్టలతో మీరు మీ దాన ధర్మాలను నాశనం చేసుకోకండి"** ***(అల్ బఖర 2 : 264)***

**అబూ హురైర (రజి) కథనం ప్రకారం దైవ ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: మీరు జకాత్ చెల్లించేటపుడు దాని పుణ్యఫలాన్ని మరవకండి. ఇలా వేడుకోండి–ఓదేవా! ఈ ధనాన్ని పుణ్యఫలంగా చెయ్యి (భారంగా చేయకు)"**

***(సునన్ ఇబ్నెమాజ).***

ధనం ఖర్చుపెట్టడం మనసుకు చాలా బాధపెట్టే విషయం మనసుకు కష్టమైన పని. అందుకొరకే దానం చేసేటపుడు మనసులో కొంత బాధ కలుగవచ్చు లేదా

teluguislam.net
1/2 తులాలు



ఏదైనా షైతాన్ ప్రేరణ కలుగవచ్చు అందుకే దైవప్రవక్త (స) ఈ దుఆ నేర్పించారు. దీనివలన ధార్మిక పుణ్యకార్యాల్లో ఖర్చు చేయటం కష్టతరం కాదు, ధర్మం పై ఆచరించటం సులభతరం అవుతుంది.

మరికొందరు జీవితాంతం లెక్కపెట్టి మరీ సంపాదిస్తారు, కూడబెడతారు. మరణ సమయంలో మాత్రం "అక్కడ అంత దానం చేయండి" "ఫలానా వారికి ఇంత ఇవ్వండి" అని మరణ శాసనం వ్రాస్తారు. మరణ సమయంలో ఖర్చుపెట్టడం కన్నా ఆరోగ్య స్థితిలో, కూడబెడుతున్న సంపదలో నుంచి ఖర్చు పెట్టడం ఉత్తమం.

జామెవుల్ బయాన్‌లో దానధర్మాలకు సంబంధించిన ఆయతుకు వ్యాఖ్యానంగా ప్రవక్త (స) వారి ఈ ప్రవచనం గమనించదగినది. ఆయన (స) ఇలా అన్నారు: "దేవుని ప్రీతి కోసం ఖర్చుపెట్టడమంటే భావం-నీవు ఆరోగ్యంగా, కుశలంగా ఉన్నప్పుడు ఖర్చు పెట్టాలి. బ్రతుకుపై ఆశ ఉన్నప్పుడు, దారిద్ర్య భయం ఉన్నప్పుడు ఖర్చుపెట్టాలి."

**అబూ సయీద్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: "ఆరోగ్యస్థితిలో ఒక రూపాయి దానం చేయటం మరణ సమయంలో నూరు రూపాయలు దానం చేయటం కన్నా ఉత్తమం."**

***(సునన్ అబూదావూద్)***

ప్రియసోదరులారా..!

జకాత్ ఎవరికి చెల్లించాలి అనేది కూడా అల్లాహ్‌నే సెలవిచ్చాడు:

إِنَّمَا الصَّدَقَاتُ لِلْفُقَرَاءِ وَالْمَسَاكِينِ وَالْعَامِلِينَ عَلَيْهَا وَالْمُؤَلَّفَةِ قُلُوبُهُمْ وَفِي الرِّقَابِ
وَالْغَارِمِينَ وَفِي سَبِيلِ اللَّهِ وَابْنِ السَّبِيلِ ۖ فَرِيضَةً مِّنَ اللَّهِ ۗ وَاللَّهُ عَلِيمٌ حَكِيمٌ ﴿٦٠﴾

**"దానాలను కేవలం నిరుపేదల కొరకూ, అభాగ్య జీవుల కొరకు, వాటి వసూళ్ల కోసం నియమితులైన వారికొరకు, హృదయాలను ఆకట్టుకోవలసి ఉన్నవారి కొరకు, మెడలను విడిపించటానికీ, ఋణగ్రస్తుల కొరకూ, దైవ మార్గం కొరకూ, బాటసారుల కొరకూ వెచ్చించాలి. ఇది అల్లాహ్ తరఫున నిర్ణయించబడిన ఒక విధి. అల్లాహ్ మహాజ్ఞాని, మహావివేకి."**

***(తౌబా 9 : 60)***